

• కోటప్పకొండలో తాగునీటి చెరువు



- అందుకే రాజకీయాల్లోకి..
- నిజాయితీతో పాలన అందిస్తా
- దోపిడీలు, కప్పాలకు చోటులేకుండా చూస్తా
- వ్యాపారాల్లో సంపాదించే రాజకీయ ప్రవేశం
- నా గెలుపుతో సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఆంధ్రజ్యోతితో బాపట్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

సేవే సంకల్పం

బాపట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదు. వ్యాపారాల్లో సంపాదించిన తర్వాతనే రాజకీయాల్లోకి అడుగుపెట్టా. దాదాపు పదేళ్ల నుంచి ప్రజల కష్టాలను గమనించినవాడిని. చేతనైన మేర సహాయం చేస్తూ వచ్చిన వాడిని. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడానికే తప్ప ఇంకోటి కాదని నా భావన. నేను రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు సేవ చేయడానికి. సేవే నా సంకల్పం. ఇప్పటికే వేగేశన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఏదో ఒక సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించాను. క్షేత్రస్థాయిలో నేను గమనించిన, ఇప్పటి వరకు నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు నామదిలో ఉన్నాయి. నా విజయం ద్వారా వాటన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నిజాయితీతో కూడిన పాలనకు మరికొద్ది రోజుల్లోనే అంకురార్పణ జరగనుంది.. అని బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తనకు ఎదురైన అనుభవాలు, ప్రజల్లో వస్తున్న స్పందన, కూటమి నేతల సహకారం వంటి అంశాలపై ఆంధ్రజ్యోతితో ఆయన ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సొంతమనిషిలా ఆదరణ

ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన గొప్పగా ఉంది. ఎక్కడికక్కడ ప్రజలు నన్ను వారి సొంత మనిషిగా ఆదరిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడిని కావడమే ఇందుకు కారణం. వేగేశన ఫౌండేషన్ సేవా కార్యక్రమాల ద్వారా ఎందరో లబ్ధి పొందారు. వారంతా నన్ను అక్కున చేర్చుకుంటున్నారు. ఐదేళ్లలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. దీంతో ప్రజలు వారి ఆకాంక్షలు నెరవేర్చే వారి కోసం ఎదురుచూస్తున్నారు. అందుకే కూటమి అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళుతుంటే అపూర్వ ఆదరణ దక్కుతోంది.

సహజవనరుల విధ్వంసం

ఐదేళ్ల వైసీపీ పాలనలో సహజ వనరుల విధ్వంసం యథేచ్ఛగా జరిగింది. ముఖ్యంగా ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి తారస్థాయికి చేరింది. ఇసుక మొదలు ప్రతి అంశంలో ప్రజలను ఇబ్బందిపెట్టారు. నియంతృత్వాన్ని, దోపిడీని ప్రజలు హర్షించరు. తప్పులను ఎత్తి చూపితే ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.

సహకారం మరువలేనిది

ప్రచారంలో బీజేపీ, జనసేన నేతలతో పాటు కార్యకర్తలు అందిస్తున్న సహకారం మరువలేనిది. కూటమి అభ్యర్థిగా నా గెలుపు కోసం వారు ప్రచారంలో తోడుంటున్నారు. గ్రామగ్రామాన సమన్వయంతో పనిచేస్తున్నాం. ఎటువంటి పొరపచ్చాలకు తావు లేకుండా ముందుకు వెళ్తున్నాం. ఎన్డీయే కూటమిని తిరిగి అధికారంలోకి తేవడమే అందరి లక్ష్యం. ప్రజా ప్రభుత్వంతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతాం.

ముక్కుసూటిగానే మాట్లాడతా

ఏదైనా ఉన్నది ఉన్నట్లు ముక్కుసూటిగానే మాట్లాడతా. నిజాయితీయే నా బలం. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా నమ్మిన సిద్ధాంతాన్ని వదిలేది లేదు. అంతిమంగా ధర్మం, న్యాయం, నిజాయితీయే గెలుస్తాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఎదుటివాడు తప్పు చేస్తే తప్పనే చెబుతా తప్ప దానిని సమర్థించను. అదే సమయంలో నా వైపు నుంచి ఏమన్నా లోటుపాట్లు ఉన్నా సరిదిద్దుకోవడానికి వెనకాడను.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా..

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ప్రతి సమస్యను పరిష్కరిస్తా. అందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. బాపట్ల పట్టణ ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యను తీరుస్తా. పంటకాల్వలలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా పూడికలు తీయించి రైతులు ఇబ్బంది పడకుండా చూస్తా. సూర్యలంక సముద్రతీరాన్ని టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా. విద్య, వైద్యం విషయంలో మెరుగైన సేవలు అందించడమే నా ధ్యేయం.

వైసీపీ దుష్ప్రచారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పథకాలు ఆగిపోతాయనే దుష్ప్రచారాన్ని వైసీపీ చేస్తోంది. వాస్తవానికి గతంలో టీడీపీ ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసింది. బడుగు, బలహీన వర్గాల పొట్టకొట్టింది. కూటమి అధికారంలోకి రాగానే గతంలో టీడీపీ ఇచ్చిన పథకాల ను పునరుద్ధరించడంతో పాటు, మరింత మెరుగ్గా సంక్షేమం అందిస్తాం.

సూపర్ సిక్స్‌పై స్పందన భేష్

టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. మహిళలను మహాశక్తులుగా మార్చేలా టీడీపీ మేనిఫెస్టో ఉంది. ఉచిత బస్సు ప్రయాణం మొదలు పూర్ టూ రిచ్ వంటి, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటివి బలంగా ప్రజల్లోకి వెళ్లాయి. చంద్రబాబు ద్వారానే భవిష్యత్తు అని యువత విశ్వసిస్తున్నది.

స్వచ్ఛందంగా చేరికలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరేవారి సంఖ్య ఇటీవల కాలంలో మరింత ఊపందుకుంది. వారంతా టీడీపీ విధానాల పట్ల ఆకర్షితులై స్వచ్ఛందంగా వస్తున్నవారే. మేము ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. వైసీపీ పాలనలో ఆయా వర్గాల అణచివేతకు గురైన తీరు, జరిగిన విధ్వంసాన్ని జనంలోకి బలంగా తీసుకెళుతున్నాం. దాని ఫలితమే ఈ చేరికల పరంపర.

ప్రతి ఇంటి గడప తొక్కాను

ఎన్నికల ప్రచారం మొదలు కాకముందే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి తలుపు తట్టి వారి సాధక బాధకాలు విన్నాను. మళ్లీ ఇప్పుడు ప్రచారంలో మరోసారి వారి ముందుకు వెళుతున్నాను. ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత, ఆవేదన అన్నీ కలగలిసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజానీకం సిద్ధంగా ఉంది.

కుళాయి నీరు కరువే

ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చే సరికి దారుణంగా విఫలమయ్యారు. నిధుల కొరత వెంటాడుతోంది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 2,16,548 గృహాలకు, పల్నాడు జిల్లా లో 2,89,328 గృహాలకు, గుంటూరు జిల్లాలో ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యే పరిస్థితి ఉండదు. పనులు వేగవంతం చేసి ప్రజల తాగునీటి వెతలను తీర్చేందుకు అధికారులు కృషి చేయాలి.

- ఇంటింటికి రక్షిత నీరు ఎన్నటికో
- జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడక
- పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షలు
- కుళాయిల శాతం 43.66 మాత్రమే..


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇంటింటికి రక్షిత నీరు అందించే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులతో పనులు చేపట్టే విధంగా ప్రణాళికను రూపొందించారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని ఇరు ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు రూ.1021.38 కోట్ల వ్యయం అవుతుందని వ్యయం అంచనా వేశారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్ల నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాలో సుమారు రూ.105 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వలనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడు తుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

జల్‌జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యం. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరిచ్చే విధంగా రూపొందించబడ్డాయి. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్‌జీవన్ పథకం లక్ష్యమే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4,51,035 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. 43.66 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,869 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామ మాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. పనులు ఇంకా నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

పల్నాడు జిల్లాలో..

రక్షిత నీటి పరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 86,905 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,071 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. 2,89,328 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. 33.40 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గర్తించారు. ఇందుకు సంబంధించి రూ.508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు.



బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,948 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,48,240 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 19.82 శాతం నుంచి 40.64 శాతానికి పెరిగింది. ఇంకా 2,16,548 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సిం ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

గుంటూరు జిల్లాలో...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతానికి పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి.



• పెద తురకపాలెంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ దుస్థితి





భట్టిప్రోలులో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న అబ్జర్వర్ పరిమళ్‌సింగ్

ఎన్నికల విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

• సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన • పరిశీలకుడు పరిమళ్‌సింగ్

వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల పరిశీలకుడు పరిమళ్‌సింగ్ ఆదివారం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పర్యటించారు. ముందుగా వేమూరులో నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడితో చర్చించి ఆన్‌లైన్లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు. ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన వాహనాలకు ప్రచారాలకు అనుమతులు ఇచ్చే విధానంపై కమిషన్ తెలిపిన నిబంధనలను ఉల్లంఘించ వద్దని అన్నారు. ఎన్నికల విధుల్లో నిర్వహించే ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు సమ స్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న కేంద్రాల వద్ద తీసుకోవాల్సి న చర్యలను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల తహసీల్దార్లు కిరణ్, మునిలక్ష్మి, పుల్లారావు, రెవెన్యూ అధికారులు, పోలీసుశాఖ అధికారులు ఉన్నారు.

ప్రమాదంలో.. ప్రజల ఆస్తులు





- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో చేటు
- నకళ్లతో ఎవరైనా హక్కుదారులుగా నమోదు
- ఆస్తి మనదేనని నిరూపించుకోవాలంటే ఇక దేవుడే దిక్కు

అప్పిలేట్ అధికారిగా నచ్చినవారు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో అధికారమంతా అప్పిలేట్ అధికారులదే. ఆ అధికారులు ఎవరనేది స్పష్టంగా చెప్పలేదు. ఎవరినైనా నియమించవచ్చని యాక్టులో పేర్కొన్నారు. అదే జరిగితే రాజకీయ నాయకులనే ఆ స్థానంలో పెట్టుకుంటారు. తద్వారా రాజకీయ నేతల పరిధిలోకి ప్రజల ఆస్తులు వెళ్లిపోతా యి. వారు ఆడింది ఆట.. పాడింది పాటగా మారుతుంది. బాధి తులు కోర్టులకు వెళ్లాలన్నా వారు అనుమతించాల్సిందే. అంటే న్యాయ స్థానాలకు వెళ్లే అవకాశం కూడా లేనట్లే.

\- పి.రాజారావు, సీనియర్ న్యాయవాది

\- ఓ వ్యక్తి తన పేరుతో ఉన్న స్థలం అమ్మాలనుకున్నాడు. దాన్ని మీరు కొనాలనుకున్నారు. కొనుగోలు సమయంలో ఆ వ్యక్తి తన వద్ద స్థలం ఒరిజినల్ (అసలు) పత్రాలు లేవని, నఖలు (జిరాక్స్) పత్రాలు ఉన్నాయి.. వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నారు. అప్పుడు ఆ స్థలం మీరు కొంటారా? ఖచ్చితంగా కొనరు. ఎందుకని? ఆ స్థలం అతడిదో కాదో తెలుసుకోలేం. ఆ పత్రాల్లోని పేరు అసలో, నకిలీయో తెలుసుకోలేం. అలాంటి జిరాక్సులు ఎన్ని ఉన్నాయో.. ఎంత మంది దగ్గర ఉన్నాయో మనకు తెలియదు. అతడు ఇంతకముందే దాన్ని అమ్మేశాడో.. మనకు తెలియదు కాబట్టి. జిరాక్స్ పత్రాలతో ఉన్న స్థలాన్ని కొనం.

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ రిజిస్ట్రేషన్ విధానంతో మొత్తంగా ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడిపోయాయి. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 135 రకాల దస్తావేజులను పూర్తిగా డిజిటల్ రూపంలోనే ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఒరిజినల్(అసలు) పత్రాలు ఇవ్వరు. కేవలం జిరాక్సులు మాత్రమే ఇస్తారు. ప్రక్రియలో అసలు దస్తావేజుల పాత్ర, అమ్మకం, కొనుగోలుదారుల అసలు సంతకాలు, వేలిముద్రలతోగానీ పనిలేదు. అవన్నీ 'క్రిటికల్ రివర్' అనే సంస్థ వద్ద ఉంటాయి. ప్రభుత్వం సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్(ఎన్ఐసీ)ని పక్కన పెట్టి ప్రైవేటు సంస్థను రంగంలోకి దించడంతో ఈ ప్రమా దం మరింత పెరిగింది.

హక్కు దారులకు తెలియకుండానే అమ్ముకునే వీలు..

అసలు దస్తావేజులు, హక్కుదారుల సంతకాలు, వేలి ముద్రలు అన్నీ డిజిటల్ రూపంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం, ప్రైవేటు సంస్థ వద్దే ఉంటాయి. దీంతో కక్షిదారులతో సంబంధం లేకుండా వాటిని వారు ఏమైనా చేసే అవకాశం ఉంది. అసలు వ్యక్తులకు తెలియకుండా వాటిని తాకట్టు పెట్టుకోవచ్చు.. విక్రయించుకోవచ్చు. తిరిగి లబ్ధిదారు మళ్లీ రిజిస్ట్రేషన్‌కు వెళితే తప్ప తన ఆస్తులు ఏమయ్యాయో అతడికి తెలిసే అవకాశం లేదు.

జిరాక్సులతో రిజిస్ట్రేషన్ ప్రమాదం..

స్థలాన్ని అమ్మదలచిన వ్యక్తి తన దగ్గరున్న జిరాక్సు పత్రాలు చూపించి ఆ స్థలాన్ని ఉదయం పూట ఒక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్థలాన్ని అమ్ముకున్నాడనుకుందాం. అదే వ్యక్తి, మళ్లీ అవే జిరాక్సులతో కొద్దిసేపటి తర్వాత దగ్గరలోని వేరే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వేరొకరికి ఆ అమ్మి మళ్లీ రిజిస్టర్ చేయవచ్చు. మొదట అమ్మిన వివరాలు ఈసీలో నమోదు అవ్వాలంటే 24 గంటల సమయం గడవాలి. ఈలోపు అతడు ఎన్ని రిజిస్ట్రేషన్లైనా చేయించుకోవచ్చు. ఎంతమందికైనా అమ్ముకోవచ్చు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో మరింత చేటు

ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న భూ యాజమాన్య హక్కుల (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) చట్టంతో ఈ అక్రమాలకు మరింత అవకాశం ఉంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో భాగంగా చేపట్టే రీ సర్వేతో అందరి తలరాతలు ఒక్కసారిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఒక్క జిరాక్సు పుట్టించుకుంటే చాలు సదరు స్థలంపై తానూ హక్కుదారుగా నమోదు చేసుకోవచ్చు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు కింద రూపొందించే వివాదాల (డిస్ప్యూట్) రిజిస్టర్‌లో పేరు నమోదు చేయించుకోగలిగితే చాలు. ఇక ఆ స్థలం హక్కుదారుకు హక్కులన్నీ పోతాయి. హక్కుదారు తన వద్ద అసలు పత్రాలు ఉన్నా సదరు స్థలాన్ని అమ్ముకోలేడు. టైట్లింగ్ అధికారి ఆమోదిస్తే తప్ప సొంతదారు ఆ స్థలాన్ని అమ్ముకోలేని పరిస్థితి వస్తుంది. అంటే మొత్తంగా సొంతదారు ఆస్తి పూర్తిగా టైట్లింగ్ అధికారి పరిధిలోకి తద్వారా రాజకీయ పెద్దల పరిధిలోకీ వెళ్లిపోతుంది. స్థలం తనది అని నిరూపించుకోవాల్సిన బాధ్యత సొంతదారుడి మీదే పడుతుంది. అది తనదేనని నిర్ధారించుకునే వరకూ అతడు తన సొంత స్థలం కూడా అమ్ముకోలేడు. తన సొంత స్థలం అని నిరూపించుకోవడానికి కోర్టుకు వెళ్లే అవకాశం కూడా లేదు. ఇలా త్రిశంకు స్వర్గంలో నలిగిపోయి సర్వం కోల్పోవాల్సిన భయానక స్థితి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దాపురించనుంది. సామాన్యుల ఆస్తులు దోపిడీ చేయడం కోసమే వైసీపీ ప్రభుత్వం ఈ విధానాలను ముందుకు తెస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికార జోక్యంతో న్యాయం ఎండమావే..

భూ సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే అధికారం న్యాయస్థానాలకు ఉండేది. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా దాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. తద్వారా రాజకీయ పలుకుబడిలోకి వెళ్లి హక్కుదారులు ఘోరంగా నష్టపోతారు. అదే జరిగితే భూ వివాదాల్లో సామాన్యులకు న్యాయం ఎండమావే.

\- వేమూరి శ్రీనివాసరావు, అడ్వకేటు

సీఎం జగన్ ఆటబొమ్మ రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, వేదికపై మాదవి తదితరులు

- నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టేవాడిని
- మూడు రాజధానులు కావాలన్న రోశయ్యపై పెమ్మసాని ఫైర్

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 'కిలారు రోశయ్య సీఎం జగన్ ఆటబొమ్మ.. మూడు రాజధానులు కావాలని జగన్ చెప్పమంటే ఆయన చెప్పేస్తారా? ప్రజల గురించి ఆలోచించేది లేదా? అదే నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టి వచ్చేవాడిని' అంటూ వైసీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారు రోశయ్యపై కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విరుచుకుపడ్డారు. గుంటూరులోని 38వ డివిజన్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలారు రోశయ్య 700 ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అక్రమ సంపాదనను వెనకేసుకున్నారని అందుకే జగన్ చెప్పినట్టల్లా ఆడుతున్నారని విమర్శించారు. అక్రమ మైనింగ్ ద్వారా రూ.2,300 కోట్లు అవినీతి చేశారు కాబట్టే, జగన్ చెప్పినదానికల్లా తల ఊపుతున్నారని విమర్శించారు. అందుకే ఎంపీగా ఓడిపోతారని తెలిసినా సరే గత్యంతరం లేక రోశయ్య పోటీ చేస్తున్నారని అన్నారు. అలాగే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న రజని ఒక పద్ధతి ప్రకారం అవినీతి చేస్తున్నారని, అందుకే చిలకలూరిపేట ప్రజలు వద్దనుకున్నారని చెప్పారు. అందువల్లే ఓటమి భయం కొద్దీ ఆమె గుంటూరు వచ్చి ఆమె చేరారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు, యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు, దేశాలకు వలస పోవాల్సిన అవసరం వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమెరికాలో స్థిరపడ్డ ప్రవాసాంధ్రుల సహకారంతో పార్లమెంట్, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలను తీసుకురావాలంటే ఒక కఠోర శ్రమ అవసరమని సొంత నేలపై, పుట్టిన భూమిపై ప్రేమ ఉన్నవారికి మాత్రమే ఆ ప్రయత్నం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గళ్లా మాధవి మాట్లాడుతూ ఈ అరాచక ప్రభుత్వాన్ని అరికట్టాలంటే ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల హరి, స్థానిక నేతలు విఠల్రావు, కార్పొరేటర్ పద్మ పాల్గొన్నారు.

పెమ్మసాని ఆధ్వర్యంలో 180 కుటుంబాలు చేరిక

విడుదల రజని అంత జన హృదయ నేత అయితే చిలకలూరిపేట నుంచి ఎందుకు మడమ తిప్పారు? రిటర్నింగ్ అధికారికి ఆమె సమర్పించిన అఫిడవిట్‌కు, ఆస్తులకు ఏమైనా సంబంధం ఉందా? అని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. గుంటూరులోని స్థానిక 33వ డివిజన్లో ఆదివారం 100 సుమారు 180 కుటుంబాలు టీడీపీలో ఆదివారం చేరాయి. పెమ్మసాని, గళ్లా మాధవి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ప్రశాంత్, ఖాదర్, కిరణ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. బటన్ నొక్కడడానికి సీఎంతో పనిలేదని, ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నా సరిపోతుందని అంటూనే ముఖ్యమంత్రి అంటే అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి తెలిసి ఉండాలని జగన్‌కు చురకలు అంటించారు. పక్కనే పారుతున్న నది, పుష్కలమైన రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నా సరే తాగడానికి నీళ్లు ఇవ్వలేని ఈవైసీపీ నాయకులు ప్రజలను ఐదేళ్లుగా కష్టాలపాలు చేశారన్నారు. ఇల్లు దాటి బయటకు రాలేని జగన్‌కు ప్రజల కష్టాలు ఎలా అర్థమవుతాయి అని ప్రశ్నించారు. మాధవి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి ఆంధ్రప్రదేశ్‌ను జగన్ 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుందని, అసెంబ్లీ సాక్షిగా జగన్ అంగీకరించారని, సీఎం అయ్యాక ఆ మాట తప్పి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్ల వెంకటేష్‌యాదవ్, మైనార్టీ నేతలు సయ్యద్ ముజీబ్, కార్పొరేటర్ ఈరంటి హరిబాబు(బుజ్జి), డివిజన్ నాయకులు పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసాని, షరీఫ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్థానిక నేతలు



అక్రమ్‌కు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

వైసీపీకి ప్రజల షాక్ ట్రీట్మెంట్ ..

- అంజుమన్ ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడితో సహా 200 మంది టీడీపీలో చేరిక
- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 28: ఎన్నికలు దగ్గరపడేకొద్దీ నియోజకవర్గంలో వైసీపికి షాక్ మీద షాక్ కొడుతూనే వుంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. తాజాగా మంగళగిరి వైసీపీలో ముఖ్య నాయకుడు, స్థానిక అంజుమన్ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు, ఇస్లామిక్ ఫ్రంట్ సారథి అయిన షేక్ అక్రమ్ తన అనుచరులు సుమారు రెండొందల మందితో కలిసి టీడీపీలో చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఆదివారం ఉదయం వీరందరికీ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే తాడేపల్లి పట్టణ ముస్లిం నాయకులు షేక్ బుడే ఆధ్వర్యంలో షేక్ ఖాజా, షేక్ భాషా, షేక్ ముక్తియార్ సహా 22 ముస్లిం కుటుంబాలు యువనేత సమక్షంలో టీడీపీలో చేరారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మొదటిసారిగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేనన్నారు. తరువాత చంద్రబాబు హజ్‌హౌస్ నిర్మాణం చేసి ముస్లింల పట్ల తనకున్న మమతానురాగాలను చాటుకున్నారన్నారు. మైనారిటీవర్గాలో పేదల సంఖ్య ఎక్కువగా వుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల కోసం రంజాన్ తోఫా, దుల్హన్, హజ్‌యాత్రకు సబ్సిడీ, రంజాన్ సమయాల్లో మసీదులకు రంగులు వేయించడం, షాదీఖానాల నిర్మాణం, విదేశీవిద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. జగన్ అధికారంలో వచ్చాక వాటన్నింటిని రద్దుచేసి ముస్లింలకు చాల అన్యాయం చేశాడన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని తిరిగి పునరుద్ధరించడంతో పాటు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటుచేసి పేద ముస్లింలకు సబ్సిడీలపై రుణాలను అందజేస్తామన్నారు. మైనారిటీ విద్యార్థుల కోసం కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో పెద్ద సైకో, మంగళగిరిలో చిన్న సైకో వున్నాడన్నారు. అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయిస్తామని లోకేశ్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, వల్లభనేని వెంకట్రావు, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

కేంద్ర సహకారంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం మంత్రి విడదల రజిని సొంత గ్రామం పురుషోత్తపట్నంలో జరిగిన కార్యక్రమంలో 100కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు ఆధ్వర్యంలో నీటి సంఘం మాజీ చైర్మన్ విడదల సాంబయ్య, మిరియాల లక్ష్మీనారాయణ, తోట పుల్లప్ప, తోట శివయ్య తదితరులు ఉన్నారు. వీరికి ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సొంత గూటికి వచ్చిన అందరికీ అభినందనలు తెలిపారు. బీజేపీతో పొత్తు వల్ల ఏ వర్గానికి ఇబ్బంది రాదని చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానికంగా చూస్తే గత ఎన్నికల్లో పురుషోత్తపట్నంలో వైసీపీకి భారీ మెజార్టీ ఇచ్చారని, ఈసారి రివర్స్‌లో తెలుగుదేశానికి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్లల్లో చిలకలూరిపేటలో అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని ప్రత్తిపాటి అన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కంచుకోటలో కూటమికి బ్రహ్మరథం



శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

- అరవిందబాబు, శ్రీకృష్ణదేవరాయలు ర్యాలీకి విశేష స్పందన
- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

నరసరావుపేటరూరల్, ఏప్రిల్ 28: వైసీపీ కంచుకోట నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నరసరావుపేట టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దశాబ్దాలుగా టీడీపీ కనీసం ప్రచారం కూడా చేయని ప్రాంతంలో వేలాదిమందితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. పదేళ్లుగా జగన్‌రెడ్డి కోసం, వైసీపీ జెండా మోసిన కార్యకర్తలను దగా చేశాడంటూ కార్యకర్తలు ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవితాలు కారు చీకట్లలో మగ్గిపోతున్నాయని డాక్టర్ చదలవాడ అరవిందబాబు ధ్వజమెత్తారు. నవరత్నాల పేరుతో నయవంచనకు పాల్పడిన జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి, గోపిరెడ్డిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ధరల బాదుడు, చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలివ్వాలని తాపత్రయపడితే.. జగన్ రెడ్డి కల్తీ మద్యం, గంజాయి డ్రగ్స్ తెచ్చి యువత జీవితాలను ఛిద్రం చేశాడని మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తే జగన్ రెడ్డి మాత్రం దోచుకోవడం దాచుకోవడంతో రాష్ట్రాన్ని అవస్థలపాలు చేశాడని డాక్టర్ చదలవాడ ధ్వజమెత్తారు. అరాచక ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టి ప్రజాస్వామ్య పాలన సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని డాక్టర్ చదలవాడ, లావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు



ప్రసంగిస్తున్న వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి, వేదికపై అరవిందబాబు తదితరులు

అభివృద్ధి ప్రస్తావన లేని వైసీపీ మేనిఫెస్టో

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్28: వైసీపీ మేనిఫెస్టోలో ప్రజల సొమ్ముతో ఓట్లు దండుకునే పథకాల కొనసాగింపుకు ప్రాధాన్యం ఇచ్చారేతప్ప ఎక్కడా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక ప్రస్తావనే లేదని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. ఆదివారం గుంటూరులోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ మేనిఫెస్టోలో మద్య నిషేధం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. 14 లక్షల కోట్లకు పైగా పెరిగిన అప్పుల భారానికి పరిష్కారం చూపలేదన్నారు. విశాఖ స్టీల్, కడప స్టీల్, విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదాల ప్రస్తావన లేదని తెలిపారు. మూడు రాజధానులను కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లుగా మార్చుకోవాలనే కుటిల ప్రయత్నంగా కనిపిస్తుందన్నారు. లోక్‌సత్తా గుంటూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ నూతలపాటి అరవింద్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 28: అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జునపేట 5లైన్‌కు చెందిన ఆవులమంద శ్రీనివాసరావు (47) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపేట 5వ లైనుకు చెందిన ఆవుల మంద శ్రీనివాసరావు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. సుమారు రూ.25 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని భావించి ఇంటిలోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య హేమార్చన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ మధ్యన మూడో రైలు మార్గం నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరు మీదగా దారి మళ్లించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. నెంబరు. 18519/18520 విశాఖపట్టణం - ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 9, 15, 21 తేదీల్లో గుంటూరు, నడికుడిమీదగా దారి మళ్లిస్తామని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు. 18045 షాలిమార్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మే 2, 3,8, 9, 20,21 తేదీల్లో, నెంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 3,4,9,10, 21, 22 తేదీల్లో, నెంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 21 గుంటూరు మీదగా దారి మళ్లించి గమ్యస్థానాలకు చేర్చడం జరుగు తుందన్నారు. అలానే నెంబరు. 11019 సీఎస్‌ఎంటీ - భువనేశ్వర్, నెంబరు. 11020 భువనేశ్వర్ - సీఎస్‌ఎంటీ రైలుని మే 2, 3, 8, 9, 20, 21 తేదీల్లో, నెంబరు. 07225 సికింద్రాబాద్ - షాలిమార్ ప్రత్యేక రైలుని ఈ నెల 29, మే 6, 20 తేదీల్లో, నెంబరు 07226 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 30, మే 7, 21 తేదీల్లో, నెంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని మే 8న, నెంబరు. 22850 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 10న గుంటూరు మీదగా నడుపుతామన్నారు.

పురుగుమందు తాగి
వివాహిత ఆత్మహత్య



జయశ్రీ (ఫైల్)

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: పురుగుమందు తాగి వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని గొట్టిపాడులో జరిగింది. తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ(30)కి గొట్టిపాడు చెందిన శివరామకృష్ణతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. ఇంట్లో పిల్లలు అన్నం తినకుండా మారం చేస్తుండగా పెద్దల మధ్య ఆ విషయంలో చిన్నపాటి గొడవ జరిగింది. భర్త కూడా తల్లిదండ్రులనే సమర్థించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన జయశ్రీ శనివారం అర్థరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో పురుగుమందు తాగింది. దీనిని గమనించిన భర్త శివరామకృష్ణ వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. ఈ మేరకు తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

ముస్లిం ఓట్లతో గెలిచి.. జగన్ వెన్నుపోటు

- మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఫీ

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం ఓట్లతో గెలిచి తిరిగి, ముస్లింలను వెన్నుపోటు పొడిచిన ముఖ్యమంత్రి జగన్ అని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఆరోపించారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం రావడానికి 90 శాతం ముస్లింలు వైసీపీకి ఓటు వేయడం వలన అసెంబ్లీకి 151 స్థానాలు, లోక్‌సభకు 22 స్థానాలు రావడానికి చాలా దోహద పడ్డాయన్నారు. రాష్ట్రంలో ముస్లిం ఓట్లతో గెలిచి కేంద్రంలో ఉన్న బీజేపీతో కలసి ముస్లిం వ్యతిరేక చట్టాలైన సి.ఎ.ఎ, త్రిబుల్ తలాక్ రద్దు చట్టాలకు మద్దతు ఇస్తూ ముస్లింలను జగన్ ప్రభుత్వం మోసగించిందన్నారు. 2014 ఎన్‌డీఏతో కలసి ఉన్న టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఎక్కడా కూడా ముస్లిం హక్కులకు భంగం కలిగించలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ముస్లిం వ్యతిరేక బిల్లులకు, చట్టాలకు చంద్రబాబు నాయుడు ఎక్కడా మద్దతు తెలపలేదన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ముస్లింలు జగన్‌కి తగిన బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00



చీరాల గోవర్ధనరెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చీరాల

బాపట్ల, ఏప్రిల్ 28: మాజీ ఎమ్మెల్యే, వైసీపీనాయకులు చీరాల గోవర్ధనరెడ్డి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 1964వ సంవత్సరంలో కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామసర్పంచ్‌గా ఎన్నికైన చీరాల గోవర్ధనరెడ్డి 1989 వరకు సర్పంచ్‌గా ఎన్నికవుతూ వచ్చారు. 1967లో కోన ప్రభాకరరావుకు మద్దతునిచ్చారు. 1983లో తెలుగుదేశంపార్టీలో చేరారు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 1989లో కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో తెలుగుదేశం అభ్యర్థికి మద్దతు తెలిపారు. 1999లో మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 2004 సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలియజేసి గాదె వెంకటరెడ్డి విజయానికి కృషి చేశారు. 2009లో తెలుగుదేశంపార్టీ టిక్కెట్టు కేటాయించినప్పటికి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీలో చేరి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి తనకు సముచిత స్థానం కల్పించకపోవటం, కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవకపోవటం వంటి చర్యలకు పాల్పడటంతో మనస్థాపానికి గురైనట్లు ఆయన తెలిపారు. తెలుగుదేశం అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆయనను కలిసి మద్దతు తెలియజేయాలని కోరటంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకొని నెల్లూరు జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబును కలిసి ఆపార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు బాచిన చెంచు గరటయ్య, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, సీనియర్ నాయకులు పమిడి భాస్కరరావు తదితరులు ఉన్నారు. అనంతరం తాడేపల్లిలో యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

- 1594వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్28: రాష్ట్ర రాజధాని కోసం 33వేల ఎకరాల భూములను ఇస్తే సీఎం జగన్‌రెడ్డి తమను రోడ్డు పాలు జేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతుల రైతు కూలీలు మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్ష లు ఆదివారం నాటికి 1594వ రోజుకు చేరకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సీఎం జగన్ అండ్ కో స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని చెప్పటం సిగ్గుచేటన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేన్నారు. ఉన్న రాజధానిని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులని ఐదేళ్లనుంచి ప్రజలను మభ్య పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు, దీక్షలు కొనసాగాయి.

పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టుకు 14 మంది ఎంపిక

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28: గుంటూరు జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ పురుషుల, మహిళల క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 30 మంది లిఫ్టర్లు పాల్గొనగా, 14 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలియజేశారు. సబ్‌జూనియర్ మహిళల విభాగంలో ఈఎల్ వినయ్‌శ్రీ, పురుషుల విభాగంలో ఆర్.నితిన్, జూనియర్ మహిళల విభాగంలో ఎం.షానూన్, ఎన్.జ్ఞానదివ్య, జూనియర్ పురుషుల విభాగంలో పీ.చంగిస్ ఖాన్, హెచ్.రమేష్‌శర్మ, వై.హర్షవర్ధన్, ఎస్.కౌషిక్, ఆర్.లలిత్ శశాంక్, పీ.పృథ్వీకుమార్, పీ.దేవేందర్‌రెడ్డి, ఎ.రామకృష్ణ, కే.శ్రీకాంత్, బి.విజయ్‌తేజ ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు మే 5న విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌ఎస్.వంశీకృష్ణ, జీ.వెంకటేశ్వరరావు, పీ.భాస్కరరావు, బి.చంద్రిక, బి.ప్రసాద్, ఘట్టమనేని సాయిరేవతి, మస్తాన్‌వలి, జీ.శిరీష, ఆళ్ల పవన్‌కుమార్, షేక్ సుభానీ, జీ.మల్లేశ్వరరావు, పీ.సందీప్, కే.మధుబాబు తదితరులు అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనందబాబు

కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత న్యాయం

● మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 28: కూటమి ప్రభుత్వం ద్వారా ఆర్యవైశ్యుల కు సముచిత న్యాయం చేస్తామని వేమూరు అసెంబ్లీ అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. ఆదివారం వేమూరు నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశాన్ని తెనాలి పట్టణంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనందబాబు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చంద్రబాబునాయు డు ముఖ్యమంత్రి హోదాలో ఆర్యవైశ్యులకు న్యాయం చేశారన్నా రు. జగన్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితులు భయంకరంగా ఉన్నాయన్నారు. వారిపై దాడులు కూడా బాగా పెరిగాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్యవైశ్య సంఘాల నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. స్పందించిన ఆనందబాబు రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలని కోరారు. నియోజకవర్గంలో తనను, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాదును గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తెనాలి మున్సిపల్ మాజీ చైర్మన్ పెండ్యాల వెంకట్రావు, ఆర్య వైశ్య సంఘ కో ఆర్డినేటర్ కొల్లిపర వెంకట శివబాపయ్య, ఆత్మీయ సమావేశ కన్వీనర్ కొల్లిపర రాధాకృష్ణమూర్తి, కొల్లూరు వాసవి దేవస్థానం అధ్యక్షులు పబ్బిశెట్టి వెంకట సత్యకుమార్, వేమూరు మండల కో ఆర్డినేటర్ కలవ వెంకట మధుసూదనరావు, చీదెళ్ల రంగారావు, భట్టిప్రోలు, వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఆలపాటి ఉపేంద్ర, నంబూరు గాంధీ, పరుచూరి రవీంద్రనాథ్, కొల్లిపర వెంకట శివబాపయ్య ప్రసంగించారు. ఐదు మండలాల పరిధి నుంచి ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆనందబాబును ఘనంగా సత్కరించారు. తమ మద్దతును సంపూర్ణగా అందిస్తామని ప్రకటించారు.

వేగేశన సతీమణి హరికుమారి ప్రచారం



మహిళలకు బొట్టుపెట్టి ఓటర్లను పలకరిస్తున్న వేగేశన హరికుమారి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 28 : మండలంలోని భవనవారిపాలెం, చౌడిపాలెం, ఎస్సీఎస్టీకాలనీ, పాతరెడ్డిపాలెం, గౌడపాలెం, కొత్తరెడ్డిపాలెం, భవనవారిపాలెం గ్రామ సచివాలయం కూడలిలో, తదితర గ్రామాలలో గ్రామ, మండలస్థాయి కూటమి నాయకులతో కలిసి నరేంద్రవర్మ సతీమణి హరికుమారి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్రవర్మ విజయం సాధించాక గ్రామాలలో తాగు, సాగునీరు, పంటకాల్వల నిర్వహణ, డ్రైనేజి వ్యవస్థ ప్రక్షాళన, వీధిదీపాలు, అధ్వానంగా ఉన్న రోడ్లకు సత్వరమే మరమ్మతులు చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించి సత్వరమే పరిష్కారం చూపుతారని నరేందరవర్మ తరుపున ఆమె హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో వేగేశన మూర్తిరాజు, భవనంవారిపాలెం గ్రామసర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు భవనం బసివిరెడ్డి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ యువనాయకులు కొత్తపల్లి పృధ్విరాజ్, ఖాజీపాలెం గ్రామ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవికృష్ణమూర్తి రాజు, నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కె.సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, మాజీ ఎంపీపీ బొలగాని సులోచన నారాయణ, చందోలుగ్రామ యువనాయకులు సయ్యద్ నిజాం, న్యాయవాది కంచర్ల అవినాష్, మండల జనసేన అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, టీడీపీ మండల బిసిసెల్ అధ్యక్షుడు పి.విష్ణువర్ధన్, మంతెనవారిపాలెం గ్రామ అధ్యక్షుడు పి.మురళీ, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మద్దాల డేవిడ్, చందోలుగ్రామ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, ఎ.సుబ్బారెడ్డి, బేతాళం నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పికట్లలో టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచారం

బాపట్ల, ఏప్రిల్ 28 : మండలంలోని అప్పికట్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు అమర్‌నాథ్, శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుర్రా ప్రభాకరరావు, సుబ్బారావు, శ్రీకాంత్, ప్రమోద్, శ్రీను, సీతారామయ్య పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలు పరిశీలించిన డీఎస్పీ

బాపట్ల రూరల్, ఏప్రిల్ 28 : రాబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బాపట్ల మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, చెక్‌పోస్టలను ఆదివారం బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ శ్రీహరి పరిశీలించారు. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలను సందర్శించి పోలీసు సిబ్బందికి డీఎస్పీ తగు సూచనలు చేశారు. అదేవిధంగా చుండూరుపల్లి చెక్‌పోస్టును చెక్ చేసి వాహన తనిఖీ సక్రమంగా జరిగేవిధంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : పట్టణ సీఐ

బాపట్ల, ఏప్రిల్ 28 : సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, విమర్శలు చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ యు.శ్రీనివాసులు హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రశాంతమైన మార్గాన్ని ప్రతి ఒక్కరు ఎంచుకొని వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. రెండురోజులుగా పర్రె కోటయ్య, జోగి రాజా అనే వ్యక్తులు వాట్సాప్ గ్రూప్‌ల కేంద్రంగా సోషల్‌మీడియాలో ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇరువురికి డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతి ర్యాలీపై రెండు కేసులు నమోదు

బాపట్ల, ఏప్రిల్ 28 : ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈనెల 19వ తేదీన వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి ఆ సమయంలో చేపట్టిన ర్యాలీలో బాణాసంచా కాల్చిన వ్యక్తులపై రెండు కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు.

శ్రీపోలేరమ్మ అమ్మవారికి విశేష అభిషేకం

బాపట్ల, ఏప్రిల్ 28 : బాపట్ల అధిష్టాన దేవత శ్రీపోలేరమ్మతల్లి దేవాలయంలో ఆదివారం ఉదయం 108 కలశాలతో విశేష అభిషేకం, అర్చన, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు. జీబీసీ రోడ్డులోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం భజన, కోలాటాలు, పాటకచ్చేరి ఏర్పాటు చేశారు.

పదిలో బాపట్ల జిల్లాలో టాపర్‌గా ఉండటం అభినందనీయం

కర్లపాలెం, ఏప్రిల్ 28 : బాపట్ల పట్టణం నరాలశెట్టిపాలేనికి చెందిన మాజీ సైనికుడు ఖలీలుల్లాహ కుమారుడు రేహన్ హఫీజ్ 10వ తరగతి పరీక్షా ఫలితాలలో బాపట్ల జిల్లాలో అత్యధికంగా 592 మార్కులు సాధించి జిల్లాకే టాపర్‌గా ఉండటం మాజీ సైనికులకు గర్వకారణమని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. జిల్లాలో 10వ తరగతిలో ప్రథమస్థానం సాధించిన రేహన్‌హఫీజ్ తల్లిదండ్రులను మాజీ సైనికులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, బాపట్ల అసోసియేషన్ సెక్రటరి సయ్యద్ అఖిల్, జాయింట్ సెక్రటరి ఆసోది రామకృష్ణారెడ్డి, ట్రెజరర్ పువ్వాడ యలమంద, సీనియర్ మాజీ సైనికులు తోట రామారావు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు సుబ్బారావు మృతి

కొల్లూరు, ఏప్రిల్ 28 : సీపీఎం సీనియర్ నాయకులు ధూళిపాళ్ల సుబ్బారావు (102) ఆదివారం కన్నుమూశారు. ఆయన మృతికి సీపీఎం నాయకుడు బి.సుబ్బారావు సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన అవయవాలను కూడా వైద్య కళాశాలకు దానం చేసిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపించండి.. సేవకుడిగా పనిచేస్తా

● బాపట్లను అభివృద్ధి చేస్తా

● టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 28 : బాపట్ల ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే సేవకునిగా ప్రజలకు సేవలందిస్తానని, అన్నిరంగాలలో బాపట్లను అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని 13, 17, 18, 19వ వార్డులలో నరేంద్రవర్మ విస్తృతంగా పర్యటించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూ రాష్ట్రంలో సుభిక్ష పాలన రాబోతుందని ప్రజలంతా కూటమికి మద్దతుగా ఉన్నారని



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

చెప్పారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో డబల్ ఇంజన్ ప్రభుత్వం వస్తుందన్నారు. బాపట్లకు సేవ చేసే భాగ్యాన్ని ఓటర్లు ప్రసాదించాలని అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్ళల్లో వైసీపీ పాలనలో అభివృద్ధి లేక సమస్యల సుడిగుండంలో నియోజకవర్గం చిక్కుకుపోయిందని మండిపడ్డారు. పారిశుధ్య లోపంతో దోమలు స్వైరవిహారం చేస్తూ ప్రజలు రోగాల బారిన పడేందుకు కారణమౌతున్నాయన్నారు. తాగునీటి సమస్య తాండవిస్తుండగా వీధిదీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్‌తోపాటు వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ రావటంతోపాటు 18 ఏళ్ళు నిండిన మహిళలకు ప్రతి నెల రూ.1500 అందించటం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన అన్ని ప్రణాళికలు కూటమి రూపొందించిందన్నారు. ఏడాదికి రైతుకు రూ.20 వేలు ఇవ్వటం జరుగుతుందన్నారు. మహిళలకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగభృతి, చదువుకునేవారికి ఏడాదికి రూ.15 వేలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సంకీర్ణప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కూడా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 17వవార్డులో ఇస్త్రీ చేసి కార్మికుడిని ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కుమార్తె తెన్నేటి రష్మి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గొలపల శ్రీనివాసరావు, విన్నకోట వీరయ్యనాయుడు, చేజర్ల సతీష్, బూర్లె రామసుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకులు శివసాంబిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాపట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నరేంద్రవర్మతో పార్టీశ్రేణులు, అభిమానులు



టీ తయారు చేసి కార్యకర్తలకు ఇస్తున్న వేగేశన నరేంద్రవర్మ

వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి

● మేనిఫెస్టో ద్వారా అసహాయతను ప్రకటించిన జగన్

● ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు



ఆనందబాబుకు నదుటన తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

వేమూరు, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల ఆలోచన అర్థమైపోయిందని మ్యానిఫెస్టో ద్వారా తన అసహాయతను ప్రకటించుకున్నాడని కూటమి అసెంబ్లీ అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆయన పెరవలిపాలెం, పెరవలి గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి కూట మి అభ్యర్థులుగా అసెంబ్లీ స్థానానికి తనను, బాపట్ల ఎంపీ స్థానానికి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార రథంపై ఉండి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రసంగించారు. 11 లక్షల కోట్ల అప్పు చేసిన జగన్ ఆ అప్పును ఎలా తీరుస్తాడో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఏమీ చేయలేని పరిస్థితిలో ప్రజలందరూ కొత్త మ్యానిఫెస్టో మరికొంత ప్రయోజనాన్ని చేకూరుస్తాడని ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో పాత ఆవ కాయ పచ్చడినే మ్యానిఫెస్టోలో చూపించడం ద్వారా ప్రజలు జగన్ పరిస్థితిని గమనించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసి కేవలం అధికార దాహంతోనే విర్రవీగి తిరిగి జైలుకు వెళ్లకుండా ఉండేందుకు అనేక జిమ్మిక్కులు చేస్తున్నాడని అన్నారు. వేమూ రు ఎమ్మెల్యే, మంత్రిగా పని చేస్తున్న నాగార్జున కూడా అదే కోవలోకి చెందుతారన్నారు. ఆయన చేపట్టిన అవినీతి అక్రమాల ద్వారా ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను గమనించి ఆరు నెలల ముందుగానే ఫలాయనం చిత్తగించారని అన్నారు. ఆయన స్థానంలోకి ప్రకాశం జిల్లా కొండేపిలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని తీసుకువచ్చి పోటీకి నిలబెట్టారని ఆయన మహాఘనుడని ఇప్పటికే రైతులు, కూలాల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గతంలో రెండు సార్లు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందిం చానన్నారు. ఐదేళ్ల నుంచి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు ప్రతి ఒక్కరూ గుర్తించారని తిరిగి మార్పు కోసం నిర్ణయానికి వచ్చారన్నారు. రెండు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులతో తిలకం దిద్ది గుమ్మడికాయలతో దిష్టితీశారు. రాజస్థాన్ బ్యాండ్ వాయిద్యాల నడుమ టీడీపీ. జనసేన పార్టీల శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, దండే వెంకట సుబ్బారావు, ఊసా రాజేష్, కంచి సీతారామయ్య, చవ్వాకుల రాఘవరావు, దాసరి చిన్న, పుసులూరి సాంబశివరావు, ప్రసాదం రామయ్య, బం డారు సూరిబాబు, ఇక్కుర్తి నాగయ్య, శేషగిరిరావు, దాది లక్ష్మణరావు, శివకృష్ణ, విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆనందబాబుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు



ఓటర్లకు అభివాదం చేస్తున్న ఆనందబాబు

ఐదేళ్లల్లో అన్యాయాలు, అక్రమాలే

● వైసీపీని గద్దెదింపేందుకు ప్రజలు సిద్ధం

● తీరంలో అనగానికి ఘన స్వాగతం

రేపల్లె, ఏప్రిల్ 28: ఐదేళ్ల వైసీపీ పాలనంతా అన్యాయాలు, అక్రమాలు అవినీతి తప్ప అభివృద్ధి లేదని ఈ విషయాన్ని ప్రజలంతా తెలుసుకుని వైసీపీని గద్దెదింపేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం రేపల్లె మండలంలోని మోళ్ళగుంట, కొత్తపాలెం, నిజాంపట్నం మండ లం ధర్వజపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజలు తీవ్రం గా నష్టపోయారని యువత ఉద్యోగావకాశాలు కోల్పోయి పక్క రాష్ట్రాలకు క్యూ కడుతున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో చదువుకున్న యువతను నిర్వీర్యం చేసేవిధంగా ప్రభుత్వం మద్యం షాపు ల్లో వటంటీర్లుగా పెట్టి చిన్నచూపు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయక పోగా తీరని అన్యాయం చేసి కక్షపూరితమైన చర్యలకు పూనుకుంటూ కాలక్షేపం చేశారన్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజదానికి కూడా ఒక్క ఇటుక కూడా పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఊళ్ళో దొంగలు పెడితే మూకుమ్మడిగా వచ్చి కొడతారని, రాష్ట్రానికి గజదొంగలా ఉన్న జగన్‌రెడ్డిని మూడు పార్టీలతో తరిమికొట్టటం తప్పా అని ప్రజలను ప్రశ్నించారు. గ్రామాల్లో కనీసం తాగునీరు కూడా అం దించలేని పరిస్థితి నెలకొందన్నారు. జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో కూడా జగన్‌లా అన్ని అబద్ధాలతో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల కూటమిలనే గెలిపిస్తే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృదిధ చేస్తామన్నారు. ప్రజలంతా తమకు అండగా నిలిస్తే తీరప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.



కొత్తపాలెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనగాని, కృష్ణప్రసాద్

ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఐదేళ్ళలో స్థానిక ఎంపీ అభివృద్ధి చేసిన దాఖలాలు ఏమీ లేకపోగా తీరప్రాంతానికి ఒక్కసారి కూడా వచ్చిన పరిస్థితి లేదన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌కు అఖండ మెజార్టీ తీసుకురావాల ని, ఎంపీ అభ్యర్థిగా నాపై మీఅండదండలు చూపి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ధర్వజపాలెంలో ఎమ్మెల్యే అనగాని ముస్లిం మైనార్టీ మహిళ ల తో మాట్లాడి రానున్న ఎన్నికల్లో మీరు అండగా ఉండాలని, మీకున్న సమస్యలను పరిష్కరించే బాధ్యత నాదే అని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, జనసేన నాయకులు చిలకపూడి పాపారావు, రేపల్లె జానకిరామయ్య, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, పంతాని సాయికుమార్, కేసన రామకృష్ణ, దండుప్రోలు వెంకటేశ్వరరావు, దండుప్రోలు పిచ్చియ్య, బొమ్మిడి రామకృష్ణ, పాల్గొన్నారు.



మోళ్ళగుంటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని



ధర్వజపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

నిజాంపట్నం మాజీ ఎంపీపీ టీడీపీలో చేరిక

● వైసీపీ నుంచి 50 కుటుంబాలకు టీడీపీ తీర్థం

● సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అనగాని హామీ

రేపల్లె, ఏప్రిల్ 28: తీరప్రాంతంలోని వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ నర్రా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం దిండి అదవల గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వైసీపీకి చెందిన మరకా దేవరమ్మ, సుందరమ్మ, కమల, ఝాన్సీ, పద్మ, ఎన్.వెంకటేశ్వరమ్మ, గోని పార్వతి, ఎం.పెద పద్మావతి, పార్వతి, మరో 50 మందికి కండువాలు కప్పి ఎమ్మెల్యే టీడీపీకి చేర్చుకున్నారు. ఆమె మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి కృషి చేసేది టీడీపీయేనని ఎన్డీయే కూటమికి అండగా ఉండి గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సముచిత స్థానాన్ని కల్పిస్తామని హామినిచ్చారు. నిజాంపట్నం మండల అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్, నర్రా సుబ్బయ్య, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, కేసన వాసు, రాజేష్‌కన్నా పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీ వెంకట లక్ష్మికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

టీడీపీలో చేరిన వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి

అమృతలూరు, ఏప్రిల్ 28: వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి మేకా రామకృష్ణతో పాటు మరో 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని కూచిపూడిలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన రామకృష్ణతోపాటు, వైసీపీ గృహసారధి డి.లక్ష్మీదుర్గ, షేక్ సైదా, దేవరకొండ బీజు, దేవరాయకొండ రాయుడు, ఉసరపు గోపీ, మల్లీశ్వరి, చుక్కయ్య, సోముల, గరిక బసవయ్య, శివ ముని, వెంకటేష్, పాలపర్తి ప్రసాద్, బాలు, మునిపల్లి జేవియర్‌లకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, నక్కా ఆనందబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వం అని ప్రజలకు సేవచేయాలని కోరారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానం దం, మట్లపూడి జయపాల్, తుమ్మల భుజంగరావు, యలమంచిలి జగన్మోహనరావు, మార్పూడి ఆనంద్, తెలుగుయువత, యల వర్తి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ, తదితరులను పార్టీ లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

నేడు కొల్లూరు, వేమూరు మండలాల్లో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, ఏప్రిల్ 28 : కొల్లూరు, వేమూరు మండల గ్రామాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు రావికంపాడులో ఎన్నికల ప్రచారంలో నక్కా ఆనందబాబు పాల్గొంటారని, అక్కడ నుంచి తాడిగిరిపాడులో ప్రచారం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు వేమూరు మండలం చదలవాడలో ప్రచారం ప్రారంభమై కాకర్లమూడి, వెల్లబాడు గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు.

కూటమితోనే మహిళా సాధికారత

● ఎమ్మెల్యే సోదరి కమల అనగాని



చెరుకుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ కమల అనగాని

చెరుకుపల్లి, ఏప్రిల్ 28: రాష్ట్రంలో మహిళా సాధికారిత ఎన్డీయే కూటమి అభ్యర్థులతోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సోదరి డాక్టర్ కమల అనగాని అన్నారు. ఆదివారం చెరుకుపల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మహిళలకు ఆనాడు అన్న ఎన్టీఆర్ ప్రాధాన్యమిచ్చారని, అనంతరం చంద్రబాబునాయు డు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఆర్థికంగా బలపడే విధంగా కృషి చేశాడన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అనగాని సత్యప్రసాద్‌కు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నా యకులు పూషడపు కుమారస్వామి, పున్నారావు, తుమ్మల విజయశాంతి, వర్ధిని కవిత, హైమా పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర పురోగతి : అఖిలేశ్

కొల్లూరు, ఏప్రిల్ 28 : వైసీపీ పాలనలో తిరోగమనంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సమర్థుడు చంద్రబాబేనని టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్ తెలిపారు. ఆదివారం కొల్లూరులోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆయన స్థానిక టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బాబు సూపర్‌సిక్స్ పథకా ల కరపత్రాలను పంపిణీ చేస్తూ టీడీపీ కూటమి అభ్యర్థులు ఆనందబాబు, తెన్నేటి కృష్ణప్రసాద్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, నాయకులు సుంకర రామమోహనబాబు, కోగంటి హరిబాబు, గుమ్మడి శివ, ధూళిపూడి కృష్ణ, జీఎల్‌జీ భగవాన్, జనసేన మండల అధ్యక్షుడు బి.చలమయ్య, నాయకులు సమ్మెట దుర్గాప్రసాద్, ఉప్పు భాస్కర్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జి.ప్రసాద్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, కె.తులామాను, యడ్ల శ్రీను, కొండూరు సురేష్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేపల్లె, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు నగదు, మద్యం, బహుమతులు ఇతర వస్తువులను ఆశగా చూపి ప్రజల ను ప్రలోభాలకు గురిచేసే అవకాశాలు ఉన్నాయని జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. ఆదివారం నిజాంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పసుమర్తిపాలెం, అల్లూరి లాకుల వద్ద ఉన్న చెక్‌పోస్టులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలు సిబ్బందికి వివరించారు. అనంతరం నిజాంపట్నంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రత, చర్యల గురించి ఎస్ఐలకు, సిబ్బందికి సూచించారు. అనంతరం గోకర్ణమఠం ఎంపీయూపీ పాఠశాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. నిజాంపట్నం పోలిస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ప్రజలు కోరుకునేది అభివృద్ధి : తమ్మా శివారెడ్డి

చుండూరు ఏప్రిల్ 28 : నేడు ప్రజలు కోరుకుంటుంది అభివృద్ధిని అంతే కానీ విధ్వంసాన్ని, అరాచకాన్ని, హింసా ప్రవృత్తిని కాదని టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి తెలిపారు. వలివేరులో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటిం టి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మోదుకూరు, మండూరు, చుండూరు, దుండిపాలెం, నడిగడ్డపాలెం, చినపరిమిలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మొవ్వా శరత్‌చంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, శ్రీమాన్, కొల్లి శ్రీనివాస రెడ్డి, పోకల శ్రీనివాసరావు, కేలం శ్రీనివాసరావు, దేవిరెడ్డి నాగేశ్వరరావు, జొన్నకూటి సాంబశివరావు, రాంబాబు, అశోక్, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, పోకల గోపి, చొప్పరపు శ్రీనివాసరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయవాడ, ఏప్రిల్ 28: కుటుంబ కలహాల కారణంగా కృష్ణలంక వారధి వద్ద పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన దాసరి రవి(36) శనివారం రాత్రి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



ఫోన్ చేసి.. ప్రలోభాలు

- సరికొత్తగా వైసీపీ ఓట్ల వేట
- నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా కాల్ సెంటర్లు
- సిబ్బందితో ఫోన్ చేసి.. రాత్రికి ఇళ్లల్లో వాలి బేరసారాలు
- అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నేతలకు పార్టీ పెద్దల సూచన



వినియోగదారుల కోసం కంపెనీలు ప్రత్యేకంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని సేవలు అందిస్తుంటాయి. ఇదే రీతిలో ప్రస్తుతం ఎన్నికల కాల్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులు కాల్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని ఓట్ల వేటకు తెరలేపారు. ఓటర్లకు ఫోన్ చేసి ఏ పార్టీకి ఓటేస్తారు.. మాకెందుకు వేయరు.. అని వివరాలు తెలుసుకుని వారిని సంతృప్తి పరచడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు ఓటు వేసేవారైతే సరే.. లేదంటే వారిని లొంగతీసుకునేందుకు ప్రలోభాలకు తెరలేపారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో కాల్ సెంటర్ల కార్యకలాపాలు ముమ్మరమయ్యాయి. ఈ కాల్ సెంటర్ల ద్వారా ఫోన్లు ఒక్క ఓటర్లకే కాదు ఆ జాబితాలో ద్వితీయ శ్రేణి నాయకులు ఉండటం కూడా గమనార్హం. ప్రధానంగా టీడీపీ సానుభూతిపరులను ప్రసన్నం చేసుకోవడంపైనే కాల్ సెంటర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారని సమాచారం.

బాపట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు, ఓటర్లను లోబర్చుకునేందుకు అధికార పార్టీ అభ్యర్థులు సరికొత్త విన్యాసాలకు శ్రీకారం చుడుతున్నారు. ఏకంగా తమ సిబ్బంది చేత ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. ఓటర్లకు ఫోన్ చేయించడం, వారి నుంచి అభిప్రాయం తీసుకోవడం, రాత్రి వేళల్లో వారి ఇళ్ల దగ్గర వాలిపోవడం.. ప్రలోభాలకు గురి చేయడం.. ఇలా వైసీపీ నేతల ఓట్ల క్రీడకు శ్రీకారం చుట్టారు. ఫోన్ ద్వారా వివరాలు రాబట్టి బేరసారాలకు దిగుతున్నారు. ఓ విధంగా ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే. కానీ ఎక్కడా ఇది బయటకు రాకుండా కేవలం ఫోన్‌లో ఓటరు అభిప్రాయ సేకరణ అనే కలరింగ్ ఇచ్చి ఓట్ల కొనుగోలుకు తెరలేపుతున్నారు. దీనికి మొత్తానికి నియోజకవర్గానికి 20 మంది సిబ్బంది చేత ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి మరీ వైసీపీ ఓట్ల కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అభిప్రాయ సేకరణ అంటూ..

నియోజకవర్గంలోని సదరు నేత కార్యాలయం వద్ద నుంచి ఫోన్ అంటే వాస్తవ ఫీడ్ బ్యాక్ రాదనే ఉద్దేశంతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటరును అభిప్రాయం అడిగేలా వైసీపీ నేతలు ప్రణాళికలు రచించారు. ఓటు వైసీపీకే వేస్తారుగా అని మొదలుపెట్టి కాదంటే ఎందుకు అనే కోణంలో ఆరా తీసి వారిని ప్రలోభ పరిచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మొత్తం ప్రక్రియ ఆయా నియోజకవర్గాల్లోని వైసీపీ అభ్యర్థుల కనుసన్నల్లో జరగడం గమనార్హం. నిత్యం ప్రచారంలో వైసీపీ నేతల వెంబడి తిరిగే ద్వితీయశ్రేణి నేతలు కూడా ఈ ఫోన్ కాల్ వలలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ అనగానే స్థానికంగా ఉన్న పరిస్థితి.. తమ అసంతృప్తికి కారణం.. తదితరాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు. ఈక్రమంలో పొద్దున లేస్తే పక్కన తిరిగే వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు కూడా పార్టీకి ఈ సారి ఓటు వేయబోం అని చెబుతుండేసరికి అవాక్కవడం అభ్యర్థుల వంతవుతోంది. వారిని ప్రసన్నం చేసుకోవడానికి పెద్దఎత్తున బేరసారాల ప్రక్రియకు తెరలేపుతుండడం గమనార్హం.

నిబంధనల అతిక్రమణలివే...

ఎన్నికల వేళ రహస్యంగా ఓ 20 మందితో కాల్ సెంటర్ తరహాలో ఏర్పాట్లు చేసుకుని ఓటర్లకు ఫోన్ చేసి ప్రలోభపెట్టడం కోడ్ అతిక్రమణే. ఇక ముఖ్యంగా రాత్రి వేళల్లో కీలక నేతలే సదరు ఓటర్ల ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ప్రయోజనాల విషయంలో హామీ ఇవ్వడం నిస్సందేహంగా ఎన్నికల్ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది. కొన్ని అంశాల విషయంలో బహిరంగంగా నిఘా ఉంటే, మరికొన్నింటిలో రహస్యంగా నేతల కదలికలపై నిఘా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిది. ఫ్లయింగ్ టీం స్క్వాడ్‌లతో పాటు ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్‌లది ఇందులో కీలకపాత్ర. కానీ వారు ఆశించిన స్థాయిలో పని చేయకపోవడంతో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రలోభాల పర్వానికి తెరలేపుతున్నారన్న విమర్శలున్నాయి

ఓటమి భయంతోనే ఈ తరహా కుట్రలు...

ఓటమి భయంతో వైసీపీ నేతలు, అభ్యర్థులు ఈ తరహా ప్రలోభాల కుట్రలకు తెరలేపి కాల్‌సెంటర్ల ద్వారా ఓటర్లను నయానో, భయానో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. అలాకాకుండా కాల్ సెంటర్ రాజకీయం ద్వారా రాత్రిళ్లు ఓటర్లను కలిసే వికృత రాజకీయానికి తెరలేపడమే అభ్యంతరకరమనే వాదనను టీడీపీ చేస్తోంది. ఇదే విషయం టీడీపీ పెద్దల దృష్టికి వెళ్లడంతో అభ్యర్థులను అప్రమత్తం చేయడంతో పాటు పాలక పార్టీ నేతల కుట్రలపై జాగరుకతతో ఉండాలని హెచ్చరించింది. వైసీపీ అభ్యర్థులు ఓట్ల వేటలో భాగంగా పాల్పడుతున్న అనైతిక కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అభ్యర్థులను పార్టీ పెద్దలు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రచారం ముమ్మరంగా చేసుకోవడంతో పాటు ప్రత్యర్థులు పాల్పడే కోడ్ ఉల్లంఘనలపై కూడా దృష్టి పెట్టి రుజువులతో ఈసీకి ఫిర్యాదు చేయడమో లేక సంబంధిత ఆర్వో దృష్టికి తీసుకెళ్లడమో చేయాలని సూచించింది.

ఫోన్ నెంబర్లు ఎలా చేరాయి?

నియోజకవర్గాల వారీగా గంపగుత్తగా ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థులకు ఎలా చేరాయి. ఓట్ల కోసం దరఖాస్తులతో పాటు ఇచ్చే ఫోన్ నెంబర్లు ఎన్నికల అధికారుల దగ్గర రహస్యంగా ఉండాలి. అలాంటి నెంబర్లు అధికార పార్టీ వ్యక్తుల వద్దకు చేరడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార కార్యకలాపాల కోసం ఫోన్ నెంబర్లను సేకరించడం, వినియోగదారులను విసిగించడం ఒక విధంగా నేరం. అలాంటిది కాల్ సెంటర్ పెట్టడం, ఫోన్లు చేయడంపై నేరమైనా ఎన్నికల అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గాల్లోని ఓటర్ల ఫోన్ నంబర్లు అందునా టీడీపీ సానుభూతిపరుల ఫోన్ నంబర్లు గంపగుత్తగా వైసీపీ నేతల దగ్గరకు ఎలా వెళ్లాయనే దానికి ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చందా కోసమా.. పద్దులపై చర్చా?

- నేడు అత్యవసరంగా మిర్చి కమీషన్ ఏజంట్ల భేటీ
- ఇప్పటికే ఎలక్షన్ ఫండ్ కోసం వైసీపీ నేతల ఒత్తిళ్లు
- సమావేశంపై కన్నేయాలని నిఘావర్గాలకు ప్రతిపక్షాల సమాచారం

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం అత్యవసరంగా ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ సభ్యులకు సమాచారం అందించారు. లాలుపురం వై జంక్షన్ సమీపంలోని ఓ కోల్డ్‌స్టోరేజ్ ప్రాంగణంలో జరిగే సమావేశానికి ఉదయం 8.30 గంటలకల్లా హాజరు కావాలని సందేశమిచ్చారు. ప్లాట్ల అమ్మకం, ఆగ్రో క్రాప్స్ పద్దులు, వడ్డీలు, ఏసీ ఎగుమతుల పద్దులు తదితరాలపై చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. అయితే అధికార వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల కోసం చందాలు వసూలు చేసి ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా ఆయా సంఘాల తరఫున దాదాపుగా రూ.కోటి వరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ సమావేశంపై వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. గుంటూరు మిర్చియార్డులో జగన్ సామాజికవర్గానికి చెందిన వ్యాపారులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత రెండు పర్యాయాల నుంచి వైసీపీ అభ్యర్థులకు అసోసియేషన్ తరఫున చందాలు వసూలు చేసి పెద్ద మొత్తంలో అందజేస్తున్నారు. ఈ దఫా యార్డు వ్యాపార కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఓ నేత వైసీపీ తరఫున ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో ఎలక్షన్ ఫండ్ ఇవ్వాలని కొన్ని రోజులుగా మిర్చి వ్యాపారులపై ఒత్తిళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎగుమతిదారుల సంఘాల నేతలకు వైసీపీ నేతలు ఫోన్లు చేసి ఎలక్షన్ ఫండ్ ఎంతో కొంత ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో లాలుపురం సమీపంలో జరిగే సమావేశంలో ఎన్నికల చందా వసూళ్లపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సమావేశంపై దృష్టి పెట్టడంతో పాటు అసోసియేషన్లలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారి బ్యాంకు లావాదేవీల పైనా ఎన్నికల అధికారులు ఓ కన్నేసి ఉంచాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

మద్యం విక్రయాలపై నిఘా పెట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా



అధికారులతో సమావేశమైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల ప్రచారం కీలకదశలో ఉన్న నేపథ్యంలో మద్యం విక్రయాలపై నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధితాధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం రవాణా, విక్రయాలు తదితర అంశాలపై ఆదివారం కలెక్టరేట్‌లో పోలీసు, ఎక్సైజ్, సెబ్, ఎన్నికల వ్యయాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మద్యం పంపిణీని అరికట్టడానికి మద్యం డంప్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మద్యం షాపుల్లో విక్రయాలపై కూడా నిఘా పెంచాలన్నారు. మద్యం అక్రమ రవాణా కట్టడికి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 2,450 మందిని బైండోవర్ చేశామని, 22,886 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, జిల్లా ఆడిట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఎన్నికలకు ఏర్పాట్లు

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి రాజకీయపార్టీలు, అభ్యర్థులు సహకరించాలన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

ఎన్నికల కొరకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు, వివిధవిభాగాల కేంద్రాలు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. ఫిర్యాదుల కొరకు ఓటర్లు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

మీడియా మానిటరింగ్	08643 - 297808
వెబ్‌క్యాస్టింగ్	08643 - 297811
సీ-విజిల్	08643 - 297804
1950 కాల్‌సెంటర్	08643 - 297802
హెల్ప్‌డెస్క్	08643 - 297812

పన్నుల బాదుడు.. సేవలు పట్టవు

> పేరుకే జిల్లా కేంద్రం ఇక్కడ చూస్తే అన్ని సమస్యలే. పారిశుధ్యం అధ్వానం, తాగునీటి సరఫరాలో సవాలక్ష సమస్యలు, దోమల బెడద, దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీల వంటి సమస్యలు పట్టణ ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ప్రధాన రహదార్ల పక్కన పారిశుధ్యం మెరుగు పరుస్తూ వార్డుల్లో మాత్రం చేయకుండా వదిలేస్తున్నారు. దీనివల్ల దోమల వ్యాప్తి అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తమీద పన్నువేసే శానిటరీ అధికారులు ఆ వ్యర్థాలను మాత్రం ప్రతిరోజు తీయకుండా వదిలేస్తున్నారు. దీనివల్ల రోడ్లపక్కనే చెత్తకుప్పల వల్ల దుర్వాసన వెదజల్లుతున్నది. కనీసం డ్రైనేజీలలో పేరుకుపోయిన వ్యర్థాలను కూడా తొలగించటం లేదు. యాంటీలార్వా స్ప్రే చేసి ఎన్నాళ్ళు అవుతుందో చెప్పలేని పరిస్థితి. గత ప్రభుత్వంలో వారంలో రెండుసార్లు తప్పనిసరిగా డ్రైనేజీలలో యాంటీలార్వా స్ప్రే చేసి వ్యర్థాలు తొలిగించి వార్డులు శుభ్రం చేసేవారు. ఇప్పుడు ఒక వార్డులో పారిశుధ్య పనులు చేయాలంటే నెలకు ఒకసారి లేదా రెండు నెలలకు ఒకసారి చేసే పరిస్థితి ఏర్పడింది. ఇంటింటా చెత్తసేకరణ కూడా కొన్ని ప్రాంతాలకు వారానికి ఒకసారి వస్తున్నారు. తాగునీటి సరఫరా రోజుమార్చి రోజు చేస్తున్నారు. పన్నువసూళ్ళు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పన్ను చెల్లించకపోతే వలంటీర్ల ద్వారా పదేపదే నోటీసులు పంపి మరీ వసూలు చేయటం పరిపాటిగా మారింది.

- పట్టణ ప్రజలపై పన్ను బాదుడు
- పారిశుధ్య పనులు నామమాత్రం
- తాగునీటి సరఫరాలో అవాంతరాలు
- ఐదేళ్ళుగా పట్టించుకోని పాలకులు
- నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బాపట్ల నియోజకవర్గంలో తాండవిస్తున్న సమస్యలు

బాపట్ల, ఏప్రిల్ 28: బాపట్ల పట్టణ ప్రజలను పన్నుభారం పట్టిపీడిస్తున్నది. ఏడాదికి 15శాతం పన్ను పెంచి వసూలు చేస్తున్న అధికారులు ఆ స్థాయిలో సేవలు మాత్రం అందించ లేకపోతున్నారు. బాపట్ల పట్టణంలో పన్నుచెల్లించే గృహాలు 18,700 ఉన్నాయి. వ్యాపారసంస్థలు 1119, వ్యాపారసంస్థలు, గృహాలు కలిసి ఉన్నవి 613 ఉన్నాయి. కేవలం గృహాల ద్వారానే బాపట్ల మున్సిపాలిటీకి ఏటా రూ.4కోట్ల 97లక్షల పన్నువస్తోంది. 12వేల గృహాలకు పైగా ప్రతి నెల రూ.60చొప్పున చెత్తపన్ను చెల్లిస్తున్నారు.

తాగునీటికి కటకట

పెరిగిన బాపట్ల పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకొని మరొక సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ అవసరం ఉంది. దీని కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బాపట్ల పర్యటనకు వచ్చినప్పుడు రూ.18కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు అది నీటిమూటగానే మిగిలిపోయింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1నుంచి 8వార్డుల ప్రజల సౌకర్యార్థం ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ కూడా ప్రారంభించలేకపోయారు. తాగునీటి పైపులైన్‌లు పగిలి నీరు వృథా అవుతున్న పట్టించుకోవటంలేదు. దీనివల్ల వేసవి తీవ్రత పెరగకముందు నుంచే పట్టణ ప్రజలకు రోజుమార్చి రోజు తాగునీరు సరఫరా చేసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రెండుసార్లు ఈప్రాంతానికి వచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ఒక్క పనికూడా కార్యరూపం దాల్చలేదు. పైగా అడవి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామాన్ని బాపట్ల పట్టణంలో విలీనం చేసి ఎన్నికలు జరపకపోవటం వల్ల జవాబు దారీతనం లోపించింది. ప్రజలు ప్రశ్నించిన పట్టించుకునేవారు లేకపోయారు. అడ్డగోలుగా దుకాణాలు, కాటేజీలు ఏర్పాటు చేసుకొని వైసీపీనాయకులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు పెద్దఎత్తున వస్తున్నాయి. ప్రభుత్వపరంగా శాశ్వత ప్రాతిపదికన ఐదేళ్లలో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదు.

మరమ్మతులకు నోచని సాగునీటి కాల్వలు

నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల రైతులకు సంబంధించిన సాగునీటి కాల్వలు మరమ్మత్తులు చేయకుండా చోద్యం చూస్తున్నారు. దీనివల్ల చివరి భూములకు సాగు, తాగునీరు చేరక తీరవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలకు గండ్లు పడటం, డ్రైనేజీల మురుగు ముందుకు వెళ్ళకపోవటం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు గత ప్రభుత్వంలో రైతులకు అందుబాటులో ఉండేవారు.ప్రధాన కాల్వలతోపాటు మీడియం, మైనర్ కాల్వలు సైతం అభివృద్ధికి నోచుకోలేదు.

పారిశుధ్యం అధ్వానం..

తగినంత మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయకపోవటం, జిల్లా కేంద్రం కావటం వల్ల ఉన్న కార్మికులకు అదనపుభారం ఏర్పడటం వల్ల వార్డులో పారిశుధ్యం తీరు ఏమాత్రం బాగుండటం లేదు. రోజుల కొద్ది చెత్తకుప్పలు తొలిగించటం లేదు. చెత్తపన్ను కట్టించుకుంటూ ఇంటింటికి చెత్తసేకరణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలపర్చలేకపోతున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవటం వల్ల దోమలవ్యాప్తి అధికమై ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. ఫాగింగ్ చేయటమే మున్సిపల్ అధికారులు మరిచిపోయారు. యాంటీలార్వా స్ప్రే ఎప్పుడు చేశారో తెలియని పరిస్థితి.

తీరంలో వసతులు శూన్యం

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్ర తీరంలో వసతుల ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంది. గతంలో పర్యాటకులు దుస్తులు మార్చుకునే గదులను అభివృద్ధి పేరిట వైసీపీ పాలకులు ధ్వంసం చేశారు. ఆ ప్రాంతంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కాట్‌లు ఏర్పాటు చేసుకొని తీరానికి వచ్చే పర్యాటకులు సేద తీరటానికి గంటకు రూ.100 వసూలు చేస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది.

జగనన్న కాలనీలు

జగనన్నకాలనీల విషయానికి వస్తే బాపట్ల పట్టణంలో ప్యాడిసన్ పేట, బేతనీకాలనీ, మూలపాలెం రోడ్డులో 3,400మందికి ప్లాట్‌లు ఇచ్చారు. ఇళ్ళు నిర్మించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అప్పులు చేసి గృహాలు పూర్తి చేసుకున్నవారికి తాగునీటి సౌకర్యంలేదు. రహదార్లు నిర్మించలేదు. డ్రైనేజి వ్యవస్థ ఏమాత్రం లేదు. దీనివల్ల ఇళ్ళల్లో ఉండేవారు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తోంది. వర్షం వస్తే రోడ్లపై నిలిచిన నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. మురుగునీరు ఇంటిముందు వదిలేసి పరిస్థితి ఏర్పడింది.

రోడ్ల విస్తరణ

బాపట్ల పట్టణంలోని విద్యానగర్‌లో కర్లపాలెంరోడ్డు నుంచి బైపాస్‌రోడ్డును అనుసందానం చేస్తూ రోడ్డు విస్తరణ పనులు చేశారు. ఎస్సీకాలనీ కావటంతో పాలకులు దీనిపై మెటల్ చల్లి వదిలేశారు. దీనివల్ల అనేక కుటుంబాలు నివాసాలు కోల్పోయినప్పటికి వారికి స్థలాలు ఇవ్వలేదు. రోడ్డును పూర్తిచేయలేదు. అదేవిధంగా ఉప్పరపాలెం నుంచి బృందావనం మల్లిఖార్జున కాలనీమీదగా జీబీసీరోడ్డును లింక్ చేస్తూ అభివృద్ధి చేసిన రోడ్డుకూడా మెటల్ వేసి వదిలేశారు.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో టీడీపీ హయాంలో నిర్మించిన తరగతి గదుల భవన సముదాయాన్ని పూర్తి చేయకుండా వదిలేసిన దృశ్యం




బాపట్ల విద్యానగర్ ఎస్సీకాలనీలో పూర్తి చేయకుండా వదిలేసిన లింకురోడ్డు



పూర్తి చేయకుండా వదిలేసినమల్లికార్జున బృందావన కాలనీ నుంచి జీబీసీ రోడ్డును కలుపుతూ ఏర్పాటుచేసిన లింక్‌రోడ్డు



ప్రారంభించకుండా వదిలేసిన బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో టీడీపీ హయాంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



బాపట్ల పట్టణంలోని రైలుపేటలో అధ్వానంగా ఉన్నడ్రైయినేజీ



బాపట్ల మున్సిపల్ కార్యాలయం పక్కనే సీసీరోడ్డు కింద తాగునీటి పైపులైన్ పగిలి పైకి వస్తున్న నీరు



బాపట్ల మున్సిపల్ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కనే పడేసిన వ్యర్థాలు



గతంలో రూ.700... ఇప్పుడు రూ.2,300

గత ప్రభుత్వ హయాంలో ఇంటిపన్ను రూ.700 వచ్చేవి. ప్రస్తుతం రూ.2,300 చొప్పున వస్తోంది. ప్రతి 6నెలలకు ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంది. పన్నుభారం పెరిగిపోయి వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉంది. ఇద్దరు పిల్లలతోపాటు కుటుంబ సభ్యులమంతా పనిచేసుకొని జీవించేవారిమి ఇంత పన్ను కట్టటం కష్టంగా ఉంది. దీనికి తోడు కరెంట్ బిల్లు కూడా ఎక్కువగా వస్తున్నాయి.

షేక్ మజురున్నీసా, టైలర్, రైలుపేట



చెత్తాచెదారంతో దోమల బెడద

వార్డులలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. డ్రైనేజీలలో వ్యర్థాలు తొలిగించకపోవటం, యాంటీలార్వీ స్ప్రే చేయకపోవటం వల్ల దోమల వ్యాప్తి అధికమై వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం ఏదో ఒక సమస్యతో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. పారిశుధ్యం మెరుగు పర్చటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పన్ను సకాలంలో చెల్లించకపోతే నోటీసులు పంపే అధికారులు ప్రజలకు అవసరమైన కనీస వసతులు, సౌకర్యాలు కల్పించకపోవటం దారుణం.

- దండు రేణుక, రైలుపేట

జగన్‌రెడ్డి పాలనకు వీడ్కోలు పలకండి

- రాష్ట్రానికి రాజధాని లేదు.. పంటలకు నీరు కరువు..
- మద్యం, ఇసుక వ్యాపారంతో దోపిడీ
- అవినీతి, అరాచకం తప్ప.. అభివృద్ధి శూన్యం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి


డేగరమూడిలో ఏలూరితో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గ్రామస్థులు

మార్టూరు, ఏప్రిల్ 28 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్‌రెడ్డికి వీడ్కోలు పలకాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఐదు గ్రామాలలో జొన్నతాళి, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం, డేగరమూడి, వలపర్ల గ్రామాలలో ఏలూరి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా, అన్నదాతకు సాగు నీరు రాకుండా చేసిన చేతగాని వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. వైసీపీ నేతలు మద్యం, ఇసుక, మట్టిని దోచుకొని కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. ఐదేళ్ల వారి పాలనలో అవినీతి..అరాచకాలు తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. అభివృద్ధి చేసినట్లు కరపత్రాలపై చూపడం.. ఫొటోలకు పోజులివ్వడం తప్ప వాస్తవం లేదన్నారు. కనీసం నీటి ప్రాజెక్టులను కూడా కట్టకుండా రైతులను ముంచారన్నారని ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. 20 శాతం పనులు చేస్తే పోలవరం పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలంగా మారేదన్నారు. గ్రామాలలో ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇలాంటి పాలకులకు సాగనంపాలని విజ్ఞప్తి చేశారు.

ఏలూరికి ఘన స్వాగతం

తొలుత జొన్నతాళి గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఏలూరికి టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. రామాలయం, పోలేరమ్మ దేవాలయం, గంగమ్మ గుడిలో ఏలూరి పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న ఏలూరికి మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఏలూరి చిమ్మిరిబండ గ్రామంలో ప్రచారానికి వెళ్లగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి ఎస్సీ కాలనీలోని డాక్టరు బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత రాజుగారిపాలెంలో, సెంటర్‌లో ప్రచారం రథంపై నుంచి ఏలూరి మాట్లాడారు. సాయంత్రం డేగరమూడి వచ్చిన ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. పోలేరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబును మళ్లీ రప్పిద్దాం.. రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిద్దాం.. అంటూ మహిళలు పోస్టర్‌తో ఏలూరికి స్వాగతం పలికారు. రాత్రి వలపర్లలోని సినిమా హాలు సెంటరు, గరటయ్య కాలనీ, చేనేత కార్మికుల వీధులలో ఏలూరి స్థానిక నేతలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

యద్దనపూడి మండల వైసీపీకి షాక్

- జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణమ్మ 50 కుటుంబాలతో టీడీపీలో చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి (మార్టూరు) : యద్దనపూడి మండలంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ జడ్పీటీసీ సభ్యులు గన్నవరం గ్రామానికి చెందిన చుండి లక్ష్మీ నారాయణమ్మ తన వర్గీయులు 50 మందితో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో వారంతా చేరారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రాభివృద్ధిని కోరుకునేవారంతా కూటమికి మద్దతు తెలపాలన్నారు. లక్ష్మీనారాయణమ్మతోపాటు కొల్లా రామయ్య, చుండి మురళి కృష్ణ, షేక్ జాన్ సైదా, పల్లెపోగు శ్రీ మాన్, పేరే చర్ల వీరరాఘవులు, బాజి, కాకాని మరియబాబు తదితరులు చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో గన్నవరం గ్రామానికి చెందిన నాయకులు నల్లపనేని రంగయ్య చౌదరి, పత్తిపాటి రాజేష్, చెరుకూరి సురేంద్ర, కొల్లా వినోద్, పత్తిపాటి వేణు బాబు పాల్గొన్నారు.


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణమ్మ

టీడీపీలో చేరిన కిషోర్‌కాలనీవాసులు

మార్టూరులోని కిషోర్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. ఏలూరి కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ హయాంలోనే కిషోర్ కాలనీ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే పూర్తిశాతం అభివృద్ధి చేస్తామని మాటిచ్చారు. ప్రతాప్ అంజి, దార్ల తిరుపాలు, దార్ల రమేష్, దార్ల శ్రీను, పెడాల భిక్షాలు, పెడాల సత్తయ్య, పెడాల వెంకయ్య, పెడాల బుజ్జయ్య పెడాల సత్యం, పెడాల శివ, పెడాల గురవయ్య, పెడాల అంకమ్మ, పెడాల తిరుపతమ్మ, పెడాల కోటమ్మ, పెడాల ఇజ్రాయేల్, పెడాల నాగేంద్రం, దార్ల గురవయ్య చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన ఆవుల తిరుపతయ్య ఉన్నారు. అదే విదంగా కోనంకి గ్రామానికి చెందిన వైసీపీ నేత కొర్రపాటి శ్రీనివాసరావు టీడీపీలో చేరారు.

ఓటుతో వైసీపీని తరిమేయండి

- సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి .. కార్పొరేషన్ రుణాలు రద్దు చేసి..
- దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


కొంగపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 28 : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించడంతోపాటు కార్పొరేషన్ రుణాలను రద్దు చేసి దళిత యువతకు ఉపాధి లేకుండా చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కొంగపాడులో రవికుమార్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సూపర్‌సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వైసీపీ 2019 మ్యానిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామని అబద్ధాలు చెప్తుందన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, మెగా డీఎస్సీ మాటే లేదని, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయలేదని, మద్య నిషేధం ఊసేలేదని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంకా పూర్తి కాలేదన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ రాజధాని లేకుండా చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఎస్సీ కాలనీలో గొట్టిపాటి ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా బ్రహ్మానందం, కరి సుబ్బారావు, మాచవరపు సుబ్బారావు, చిరంజీవి, శ్రీనివాసరావు, కమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని 14వ వార్డులో ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయరన్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జహీరా, విజయలక్ష్మి, అత్తులూరి రమేష్, సుభాషిణి, కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మ, తేజశ్విని, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, టీ డీపీ నేతలు కుందారపు రామారావు, శ్రీనివాసరావు, కాసా పుల్లయ్య, గుడివిల్ హనుమంతరావు పాల్గొన్నారు.

టీడీపీ రాగానే రూ.4వేల పింఛన్

బల్లికురవ, ఏప్రిల్ 28 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందిస్తారని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా బాబీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందుకు జగన్‌రెడ్డి అధికారంలోకి వస్తే రూ.3వేల పింఛన్ ఇస్తానని వృద్ధులను మోసం చేశారన్నారు. ఒక్కసారి ఇవ్వంకుండా విడతలుగా ఐదేళ్లవరకూ సాగదీశారన్నారు. ఒక్కచాన్స్‌తో మోసం చేసిన జగన్‌రెడ్డి మాటలను, వైసీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మొద్దన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రావులపల్లి గోవిందు, సంపతిశౌరి, ఆలకుంట యర్రంనాయుడు, సుబ్బారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, జ్యోతి ప్రసాద్, సాంబయ్య పాల్గొన్నారు.


ఎస్ఎల్ గుడిపాడులో ప్రచారం చేస్తున్న బాబీ


టీడీపీలో చేరిన విప్పర్లవారిపాలెం సర్పంచ్ శాంతమ్మ తదితరులు

టీడీపీలో చేరిన రెండు గ్రామాల వైసీపీ నేతలు

అద్దంకి మండలంలో వైసీపీకి పట్టు ఉన్న గ్రామాలైన రామాయపాలెం, విప్పర్లవారిపాలెంలో పలువురు వైసీపీ నేతలు, ఆపార్టీ సానుభూతిపరులు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో ఆదివారం జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో సైకిలెక్కారు. విప్పర్లవారిపాలెం సర్పంచ్ బొనిగల శాంతమ్మ, విజయబాబు, మోషే, బూసాల వెంకటేశ్వర్లు, ప్రభాకరరావు, జ్యోతి ఆదినారాయణ, శేషయ్య, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, ఎలీజా, తుని బాబురావు, అంజయ్య, చిరంజీవి, మాలతి, ప్రేమ్‌కుమార్, డేవిడ్, రవికుమార్, అంజయ్య, ఏడుకొండలు, గోపి, తేజతో పాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రామాయపాలెం మాజీ సర్పంచ్ కుమారుడు, వైసీపీ నేత వేములపాటి రాజశేఖరరెడ్డి, చెంచురెడ్డి, పుల్లారెడ్డి, ఏడుకొండలు, గురునాథరావు, అబ్రహం, ఏసోబు, రావులపల్లి అంకమ్మ, శివయ్యతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి సైకిలెక్కారు.


హనుమోజీపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరి కోసం కూటమి శ్రేణుల ప్రచారం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 28: అభివృద్ధి ప్రదాత, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు కోసంకారంచేడులో ఆదివారం శ్రేణులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యేగా ఏలూరిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమోజీపాలెంలో..

ఇంకొల్లు : హనుమోజీపాలెంలో ఆదివారం కూటమి నేతలు ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మళ్లీ ఎమ్మెల్యేగా ఏలూరిని గెలిపించాలని కోరారు. చేతగాని జగన్‌రెడ్డిని ఓటుతో ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, వీరగంధం, తాత, దుర్గాప్రసాద్, జనసేన నాయకులు బండారు శ్రీను,సింగయ్య, రవి, రంగిశెట్టి, రామకృష్ణ, అనంతలక్ష్మి, మాధవి, నల్లూరి క్రిష్ణయ్య, అయోషాబుడే, మల్లేశ్వరి, మీరావలి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ విజ్ఞప్తి


చందలూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 28 : మే 13న జరిగే ఎన్నికలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని గొట్టిపాటి ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. మండలంలోని చందలూరు గ్రామంలో స్థానిక నేతలు, మహిళలు, కార్యకర్తలతో కలసి ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మహిళల ఆర్థికాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందులో భాగంగానే మహిళా శక్తి పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఆసరా రత్నం రాలిపోయిందన్నారు. డ్వాక్రా రుణ మాఫీ ఊసే అందులో లేదన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రూ.1.10 కోట్ల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి రుణమాఫీని మేనిఫెస్టోలో చేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో డ్వాక్రా మహిళలతో సమావేశాలు నిర్వహించి రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పిన జగన్‌రెడ్డి మడమ తిప్పారన్నారు.

చంద్రబాబు పాలనలోనే డ్వాక్రా మహిళలకు మేలు

రాష్ట్రంలో 2019కి ముందు చంద్రబాబు పాలనలో డ్వాక్రా గ్రూపులకు మేలు చేకూరిందన్నారు. మహిళలు తీసుకున్న రుణానికి రూ.5లక్షల వరకు సున్నా వడ్డీ రాయితీని టీడీపీ అమలు చేసిందన్నారు. డ్వాక్రాలపై 20వేల కోట్ల అప్పుల భారం మోపారని ప్రచారం చేసిన జగన్ నేడు రాష్ట్ర వ్యాపితంగా డ్వాక్రా మహిళల నెత్తిన రూ.90వేలకోట్ల అప్పుల కుప్ప పెట్టారన్నారు. డ్వాక్రా మహిళలు నాడు చంద్రబాబు పాలనలో, నేడు జగన్‌రెడ్డి పాలనలో పొందిన లబ్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. మళ్లీ డ్వాక్రా గ్రూపులకు పూర్వవైభవం రావాలంటే చంద్రబాబును ఎన్నుకోవాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు వాసవి, బీజేపీ నాయకులు కొల్లి కోటేశ్వరరావు, నర్సరాజు, సుబ్బారావు, జనసేన నేత కసుకర్తి వీరహనుమాన్, పాలెపు వీరాంజనేయులు, రావూరి రమేష్, కె.వి. సుబ్బారావు, పెంట్యాల రామలింగస్వామి, మాజీ ఎంపీపీ నార్నె పార్వతమ్మ, బాలిన రామసుబ్బారావు, మస్తాన్‌వలి, ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే అన్నివర్గాల అభ్యున్నతి

- వాటి సాధన కోసం మనం గెలవాలి
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య


ఈపురుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య


చీరాల, ఏప్రిల్ 28 : చంద్రబాబు తిరిగి సీఎం అయితేనే రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి మార్గం సుగమం అవుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో ఆదివారం జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుద్దంటి చంద్రమౌళి తదితరులతో కలసి కొండయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ర్యాలీగా కూటమి అభ్యర్థులు వెళ్లే సమయంలో పలువురు స్వచ్ఛందంగా ఆ ర్యాలీలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కొండయ్య వారి సమస్యలను అడిగి తెసుకున్నారు. ప్రేమగా పలకరించడంతో ఆయా ప్రాంతాలవాసులు హర్షం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బీసీ డిక్లరేషన్ అంటే ఏంటి..? దాంతో ప్రయోజనం ఏంటనేది విశదీకరించారు. ఇవన్నీ సాకారం కావాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా టి.కృష్ణప్రసాద్ ఇరువురికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు అండగా ఉంటాం

ఆర్‌ఎంపీలకు అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. ముంతావారిసెంటర్లోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశంలో కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రత్యక్ష దైవాలన్నారు. అందులో అది గ్రామీణ ప్రాంతమైనా, పట్టణ ప్రాంతమైనా ముందస్తుగా ఏదన్నా ఆరోగ్య సమస్య ఏర్పడితే తొలిగా గుర్తొచ్చేది ఆర్‌ఎంపీలేనని చెప్పారు. వారు అందించే ప్రాథమిక చికిత్సకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తమకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ వైద్యవిభాగ ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆర్‌ఎంపీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వెన్నంటి ఉంటా

ఆర్యవైశ్యులను అండగా ఉంటా. నిరంతరం వెన్నంటి ఉంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. ముంతావారిసెంటర్లోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపలంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య ప్రతినిధి దూండీ రాకేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆశీస్సులు తమకు ఎప్పుడూ ఉండాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పిలిస్తే పలుకుతానని కొండయ్య చెప్పారు. అనంతరం ఆర్య వైశ్య ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

టీడీపీలోకి పెరుగుతున్న చేరికలు

ఆహ్వానిస్తున్న కొండయ్య

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 28 : మండల పరిధిలోని రామన్నపేట వినాయకపురం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ కూటమి టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య కొండయ్య సమక్షంలో వారు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక నాయకుడు చేవూరి వెంకటరమణ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ పేరు పేరునా కొండయ్యకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సుపరిపాలన కోసం ప్రజ లు ఎదురు చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా తన ను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటుచేసి గెలిపించాలని కోరారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చాక సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట్రావు, సంజీవి, గోపి, దుర్గ, అంకుల్, నాగమణి, సంధ్య బాలకోటయ్య, శివమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి మేనిఫెస్టోను నమ్మొద్దు

ఇంటింటి ప్రచారంలో హర్షవర్ధన్


పాతమాగులూరులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

సంత మాగులూరు, ఏప్రిల్ 28: టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ముందు వైసీపీ మేనిఫెస్టో వెలవెలబోయిందని, జగన్‌రెడ్డి మేనిఫెస్టోను ప్రజలు నమ్మవద్దని టీడీపీ యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామంలో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మే 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెపిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపరిచిన ఏ ఒక్కదానినీ జగన్ అమలు చేయలేదన్నారు. అభివృద్ధి లేక రాష్ట్రం నాశనమైందన్నారు. మళ్లీ ప్రజలను మోసగించేందుకు వస్తున్న వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాగానే తొలి నెల నుంచే రూ.4వేల పింఛన్ ఇస్తుందన్నారు. నవరత్నాలతో నయవంచన చేసిన జగన్‌రెడ్డిని ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కూటమికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, సన్నెబోయిన ఏడుకొండలు, రామారావు, శ్రీరామమూర్తి, సుజాత, గోవిందమ్మ, చల్లా కృష్ణ, రామాంజి పాల్గొన్నారు.


నాగులపాలెం చెరువుకు చేరిన సాగర్ జలాలు

ఎట్టకేలకు నాగులపాలెం చెరువుకు సాగర్ జలాలు

నాగులపాలెం (పర్చూరు), ఏప్రిల్ 28 : మంచినీటి ఎద్దడిని అధికమించేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు ఎట్టకేలకు చెరువుకు చేరుతున్నాయి. దీంతో వేసవి గండం గట్టెక్కినట్లని ప్రజలు చెందుతున్నారు. తొలిదశలో నీటిని విడుదల చేసిన తరుణంలో చుక్క నీరు కూడా చెరువులకు చేరకపోవడం, ఉన్న రెండు మంచినీటి చెరువులు అడుగంటి పోవడంతో ప్రజలు ఇకింత ఆందోళనకు గురయ్యారు. చెరువులో నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పక్క గ్రామాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఎట్టకేలకు సాగర్ జలాలను విడుదల చేయడంతో యుద్ధప్రాతిపతికన చెరువులను నింపుకొనే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ఈవేసవి తాగునీటి ఇబ్బందుల నుంచి బయటపడవచ్చని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కవాతు నిర్వహిస్తున్న ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

చీరాలటౌన్, ఏప్రిల్ 28 : ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలు సహకరించాలని ఈపూరుపాలెం ఎస్ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఎస్సై ప్రత్యేక బలగాలతో గవినివారిపాలెం, పిట్టువారిపాలెం, రామాపురం, దేవినూతల గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామ ప్రజలతో మాట్లాడారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో తిరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా రాములోరి కల్యాణం

చీరాల, ఏప్రిల్ 28 : 20వ వార్డు బందావారివీధిలోని ఆలయంలో ఆదివారం రాములవారి కల్యాణ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వెంకట సురేష్, కళ్లగుంట అంజమ్మ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


బాధితకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

చినగంజాం, ఏప్రిల్ 28 : ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుదేవా కాలనీలో ఆదివారం జరిగింది. ప్రభుదేవాకాలనీలో కట్టా తిరుపతమ్మకు చెందిన పూరిల్లు ఆహుతైంది. తిరుపతమ్మ ఇంటి సమీపంలోని బోరు వద్దకు తాగునీరు కోసం వెళ్లి వచ్చేసరికి ఇంటిలో మంటలు చెలరేగాయి. కాలనీలోని వారు వచ్చి మంటలు అదుపుచేశారు. ఇంటిలోని వస్తువులు, దుస్తులు కాలపోయాయి. ఈ ప్రమాదంలో రూ.60వేల నష్టం కలిగినట్లు బాధితరాలు తెలిపారు. చినగంజాం-2 ఎంపీటీసీ సభ్యులు తుమ్మలపెంట లక్ష్మీప్రసన్న భర్త శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. పక్కా గృహం మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

30న పోలేరమ్మ తిరునాళ్ల

పర్చూరు, ఏప్రిల్ 28 : పర్చూరు మండల పరిధిలోని నూతలపాడులో గ్రామంలోని గ్రామ దేవత పోలేరమ తిరునాళ్ల ఈనెల 30న జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5గంటలకు అమ్మవారి శిడిమహోత్సవాన్ని నిర్వహించి భక్తుల దర్శనార్థం గ్రామోత్సం ఉంటుందన్నారు. కోలాటం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరునాళ్లను విజయవంతం చేయాలని కోరారు.

పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

పర్చూరు, ఏప్రిల్ 28 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవని ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రకటనలో ఖండించారు. వైసీపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఆ శ్రేణులు పవన్‌తోపాటు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇలాంటివి పునరావృతం అయితే వైసీపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

మేదరమెట్ల, ఏప్రిల్ 28 : గ్రామాలల్లో సమస్యలను పరిష్కారించడానికి కృషి చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ తెలిపారు. ఆదివారం మేదరమెట్లలో కూటమి ఎమ్మెల్యే గొట్టిపాటి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని హర్షవర్ధన్ కోరారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ సాగు, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత నిస్తామన్నారు. అంతకముందు ఆర్యవైశ్య ప్రముఖు సమస్యలపై చర్చించారు. ప్రచారంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.